సాక్షి సూర్యాపేట

శనివారం । 30 । మార్చి । 2024



ఎక్సైజ్ అధికారుల దాడులు
ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు శుక్రవారం హుజూర్‌నగర్ నియోజకవర్గంలో దాడులు నిర్వహించారు. - 8లో



అడుగంటిన 'మూసీ'
ఉమ్మడి జిల్లాలో రెండో అతిపెద్ద సాగు, తాగునీటి వనరుగా ఉన్న మూసీ రిజర్వాయర్ అడుగంటింది. - 8లో



న్యూస్‌రీల్

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

- కలెక్టర్ వెంకటరావు



మొక్కకు నీరు పోస్తున్న కలెక్టర్

దురాజ్‌పల్లి (సూర్యాపేట): నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించుకునే బాధ్యత మన అందరిపై ఉందని కలెక్టర్ ఎస్.వెంకటరావు అన్నారు. వాటరింగ్ డే సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్ రోడ్డులో నాటిన మొక్కలు, చెట్లకు కలెక్టర్ నీరు పోసి మాట్లాడారు. ప్రతి శుక్రవారం వాటరింగ్ డేగా నిశ్చయించుకొని మొక్కలు, చెట్లకు నీరు పెట్టే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. మొక్కల రక్షణ విషయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలంతా చైతన్యం కావాల్సిన అవసరం ఉందన్నారు. ఆయన వెంట పలువురు అధికారులు ఉన్నారు.

మట్టపల్లిలో నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మట్టపల్లి క్షేత్రంలో శుక్రవారం శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు వేదమంత్రాలతో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, నిత్యహోమం పూర్తిగావించి శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టువస్త్రాలతో వధూవరులుగా ముస్తాబు చేసి ఎదుర్కోలు మహోత్సం చేపట్టారు. ఆ తర్వాత విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుఫర్కపూజ, మాంగల్యధారణ, తలంబ్రాలతో కల్యాణతంతు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు అద్దేపల్లి లక్ష్మణాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీ నారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఫణిభూషణ మంగాచార్యులు, ఆంజనేయాచార్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రిలో ఊంజలి సేవోత్సవం



అద్దాల మండపంలో అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో శుక్రవారం ఆగమ శాస్త్ర ప్రకారం ఊంజలి సేవోత్సవం నిర్వహించారు. సాయంత్రం వేళ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, ఆలయ తిరు, మాఢ వీధుల్లో సేవను ఊరేగించారు. మహిళా భక్తులు మంగళ హారతులతో స్వాగతం పలికారు. అనంతరం అద్దాల మండపంలో అమ్మవారిని అధిష్టించి ఊంజలి సేవోత్సవం జరిపించారు. ఇక.. శ్రీస్వామి వారికి నిత్య పూజలు సంప్రదాయంగా కొనసాగాయి.

ప్రత్యేక టెట్ నిర్వహించాలి

మిర్యాలగూడ టౌన్ : ఇన్ సర్వీసెస్ ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ నిర్వహించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మంతరావు కోరారు. శుక్రవారం స్థానిక ఆ సంఘం కార్యాలయంలో జరిగిన జిల్లాస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను తక్షణమే ప్రకటించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో స్కావెంజర్లను ఏర్పాటు చేయాలని, పాఠశాలలకు ఉచిత విద్యుత్ అమలు చేయాలని, పదోన్నతులు, ఇతర దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని కోరారు.

- భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే



గుడ్ ఫ్రైడేలో భాగంగా శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో నిర్వహించిన శిలువ మార్గం ర్యాలీలో పాల్గొన్న క్రైస్తవులు



మఠంపల్లి శుభవార్త చర్చి ఆవరణలో శిలువ ప్రదర్శన

నీటి ఎద్దడి తీర్చేలా..

వేసవిలో నీటి సమస్య రాకుండా ప్రత్యేక కార్యాచరణ

- ప్రతి మండలం, మున్సిపాలిటీలకు బృందాల కేటాయింపు
- పాత బోర్లు, చేతి పంపులు రిపేరు చేయిస్తున్న యంత్రాంగం
- పంచాయతీ నిధులు, మినరల్ ఫండ్ ఖర్చు చేస్తూ పనులు



మోతె మండలం నామవరంలో చేతిపంపును పరిశీలిస్తున్న కలెక్టర్

దురాజ్‌పల్లి(సూర్యాపేట): ప్రస్తుత వేసవిలో జిల్లా వ్యాప్తంగా నెలకొన్న నీటి ఎద్దడి నివారణపై అధికారులు దృష్టి పెట్టారు. మిషన్ భగీరథ పైపులైన్లు, చేతి పంపులు, బోర్లతో పాటు, చిన్న పైపులైన్ల మరమ్మతులు చేయిస్తున్నారు. గతంలో ఎప్పుడూలేని విధంగా ఈసారి వర్షాలు పడలేదు. మరోవైపు కృష్ణానదిలో నీటిమట్టం తగ్గిపోతోంది. దీంతో తాగునీటికి ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. ప్రస్తుత మార్చి నెలలోనే పట్టణాల్లోని ఇళ్లలో బోరుబావులు ఎండిపోయాయి. మరో కొన్ని రోజులు మించి మిషన్ భగీరథ నీళ్లు వచ్చే పరిస్థితులు కనిపించడం లేదు. దీంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసింది. దీనిలో భాగంగా జిల్లా అధికారులు గ్రామాలు, పట్టణాల్లో తాగునీటి ఎద్దడి నివారణ పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ వేసవిలో తాగునీటికి తిప్పలు ఎదురవుతుండడంతో వాల్టా చట్టం నిబంధనలు కఠినంగా అమలు చేయాలని, అనుమతి లేకుండా ప్రైవేట్ బోర్లు వేస్తే చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.

గుర్తించిన పనులు	1,806
పూర్తి చేసినవి	1,542
పురోగతిలో ఉన్నవి	264
మరమ్మతులు పూర్తి చేసినవి..	
చేతిపంపులు	830
సింగిల్‌ఫేజ్ మోటార్లు	71
త్రీఫేజ్ మోటార్లు	294
ఓపెన్ బావులు	02
పైపులైన్లు	345

ఎక్కడెక్కడ నీటి సమస్య ఉందో గుర్తిస్తూ..

జిల్లాలో తాగునీటి సరఫరాపై ఆయా శాఖల అధికారులతో కలెక్టర్ వెంకటరావు ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. ఎంపీడీఓలు, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్లతో ప్రతి మండలం, మున్సిపాలిటీకి ఒక్కటి చొప్పున బృందాలను ఏర్పాటు చేసి ఆయా గ్రామాల్లో నీటి సమస్యలపై నివేదికలు తయారు చేయించారు. ఇందుకు అనుగుణంగా ఎద్దడి నివారణ చర్యలు తీసుకుంటున్నారు. మిషన్ భగీరథ పథకం అమలైన తర్వాత జిల్లాలోని కొన్ని పట్టణాలు, గ్రామాల్లో బోరుబావులను పట్టించుకోవడం లేదు. ఇప్పుడు మళ్లీ వాటి అవసరాన్ని గుర్తించి పునరుద్ధరించాలని నిర్ణయించారు. గ్రామాల్లో ఉన్న పాత బోరుబావులు, చేతిపంపులను సైతం పనిచేసేలా మరమ్మతులు చేస్తున్నారు. ఆవాసాల వారీగా నీటి సమస్య ఎక్కడ ఉందో గుర్తిస్తూ.. పైపులైన్లు పగిలిపోయిన చోట యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపడుతున్నారు.

మరమ్మతులు చేస్తున్నారిలా..

జిల్లా వ్యాప్తంగా 475 పంచాయతీల్లో రిపేరులో ఉన్న బోరుబావులు, పైపులైన్‌లు, మోటార్లు, చేతిపంపులను గుర్తించి మరమ్మతులు ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా గుర్తించిన 1,806 పనులకు రూ.82.84 లక్షల నిధులు అవసరమవుతాయని అంచనా వేశారు. ఇందులో చేతిపంపులు 958, సింగిల్ పేస్ మోటార్లు 97, అలాగే 331 త్రీఫేస్ మోటార్లకు, 418 ప్రదేశాల్లో పైపులైన్లకు మరమ్మతులు అవసరమని గుర్తించారు. గ్రామ పంచాయతీ నిధుల నుంచి ఖర్చు చేస్తూ మరమ్మతు పనులు చేస్తూ ముందుకెళ్తున్నారు. ఇందుకు గ్రామ పంచాయతీ నిధులే కాకుండా డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ ట్రస్టు(డీఎంఎఫ్‌టీ), స్టేట్ డెవలప్‌మెంట్ ఫండ్(ఎస్‌డీఎఫ్) నిధులను ఖర్చు చేస్తూ ప్రత్యేక పనులు చేపడుతున్నారు. తాగునీటి సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యేల నిధుల నుంచి ప్రతి నియోజకవర్గానికి రూ.కోటి చొప్పున అందుబాటులో ఉండగా అదనంగా డీఎంఎఫ్‌టీ, ఎస్‌డీఎఫ్ నిధులు వినియోగిస్తున్నారు. జిల్లాలో కేవలం డీఎంఎఫ్‌టీ, ఎస్‌డీఎఫ్ నిధులతో ప్రస్తుతం 462 పనులు చేపట్టారు.

తాగునీటి సమస్య రానివ్వం

తాగునీటి ఎద్దడి నివారణకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. చేతిపంపులు, ఇతర బోర్ల మరమ్మతులు చేయిస్తున్నాం. ప్రతి మండలానికి ఒక టీము ఏర్పాటు చేసి నీటి సమస్యను గుర్తిస్తున్నాం. చేతిపంపులు, బోర్ల మరమ్మతులకు గ్రామ పంచాయతీ నిధులు, ఇతర నిధులు వినియోగిస్తాం. ఎమ్మెల్యేల కోటా నిధులు, డీఎంఎఫ్‌టీ, ఎస్‌డీఎఫ్ నిధులు కూడా వినియోగిస్తూ తాగునీటి సమస్య రాకుండా చూస్తాం.

– ఎస్.వెంకటరావు, కలెక్టర్, సూర్యాపేట



నామవరంలో బోరు వేస్తున్న దృశ్యం

మట్టపల్లిలో నేడు కాంగ్రెస్ సమావేశం

- హాజరుకానున్న ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, ఏఐసీసీ సెక్రటరీ రోహిత్ చౌదరి

నల్లగొండ : కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ ముఖ్య నేతలతో ఎన్నికల సన్నాహక సమావేశం శనివారం మఠంపల్లి మండలం మట్టపల్లిలో నిర్వహించనున్నారు. సమావేశానికి జాతీయ, రాష్ట్ర నేతలు హాజరు కానుండడంతో పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఉదయం 10 గంటలకంటే ముందే పార్టీ శ్రేణులు మట్టపల్లికి చేరుకోనున్నారు. ముఖ్య నేతలు, పార్టీ శ్రేణులు ఉదయం 10 నుంచి 11 గంటల వరకు మట్టపల్లి మహాక్షేత్రంలోని లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకోనున్నారు. 11 నుంచి మధ్యాహ్నం 12 వరకు భోజనం, మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల వరకు సమావేశం జరుగనుంది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఏఐసీసీ తరపున ఆపార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి, ఏఐసీసీ సెక్రటరి రోహిత్ చౌదరి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మహేష్‌గౌడ్, ఎమ్మెల్యేలు హాజరు కానున్నారు.

సమావేశానికి తరలి రావాలి

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రం వద్ద ఈనెల 30న జరుగనున్న కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ స్థాయి ఎన్నికల సన్నాహక సమావేశానికి పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలిరావాలని రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. కాంగ్రెస్‌పార్టీ పార్లమెంట్ స్థాయి ఎన్నికల సన్నాహక సమావేశం ఏర్పాట్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. సమావేశం విజయవంతానికి 10 కమిటీలను వేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన మూడు మాసాల్లోనే నియోజకవర్గంలో రహదారులు, కాలనీల అభివృద్ధికి రూ.200కోట్లతో పనులు ప్రారంభించినట్లు తెలిపారు. సమావేశంలో నల్లగొండ డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, సీనియర్ నాయకులు శివారెడ్డి, మంజీనాయక్, అనంతరాములు, శ్రీనివాస్‌గౌడ్, కిషోర్‌రెడ్డి, అప్పారావు, అరుణాసైదులు, భీముడు, బాబు తదితరులు పాల్గొన్నారు.



మట్టపల్లిలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

రికార్డుస్థాయి మెజార్టీతో గెలుస్తాం

- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

భానుపురి (సూర్యాపేట): నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దేశంలోనే రికార్డు స్థాయి మెజార్టీతో గెలిచేలా కృషి చేస్తానని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సూర్యాపేటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశాన్ని ఈనెల 30న హుజూర్‌నగర్ పరిధిలోని మట్టపల్లిలో ఏర్పాటు చేశామన్నారు. బీఆర్‌ఎస్, కేసీఆర్ కుటుంబం పని ఈయిపోయిందని, వారి గురించి చర్చించడం వృథా అని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత బీఆర్‌ఎస్ పార్టీ మనుగడ ప్రశ్నార్థకం కానుందన్నారు. ఆంధ్రప్రదేశ్ రీఆర్గనైజేషన్ బిల్లు ప్రకారం తెలంగాణకు రావాల్సిన ఏ ఒక్క హామీని కూడా మోదీ ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ 12నుంచి 13ఎంపీ స్థానాలను దక్కించుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో మాజీమంత్రి ఆర్డీఆర్, డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్, వేణారెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

ఎన్నికల సిబ్బందికి మెమోలు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): ఎన్నికల విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన పది మంది అధికారులకు శుక్రవారం జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటరావు మెమోలు జారీ చేశారు. మోడల్ కోడ్ అమలులో భాగంగా కోదాడ, తుంగతుర్తి నియోజకవర్గాల్లో ఎస్‌ఎస్‌టీ (స్టాటిస్టికల్ సర్వేలెన్స్ టీమ్) విభాగంలో విధులు కేటాయించిన ఉద్యోగులు సమయానికి హాజరు కాకపోవడంతో మెమోలు జారీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. మెమోలు జారీ అయిన వారిలో తుంగతుర్తి నియోజకవర్గంలో సత్యనారాయణ (డిప్యూటీ ఈఈ), కొండయ్య (డిప్యూటీ ఈఈ), జానిమహ్మద్ (నాయబ్ తహసీల్దార్), నవీన్‌కుమార్ (డీఈ ఇరిగేషన్), బుచ్చిబాబు (మేనేజర్ తిరుమలగిరి మున్సిపాలిటీ) హరికృష్ణ (డిప్యూటీ ఈఈ), కోదాడ నియోజకవర్గంలో ఆనంద్‌కుమార్ (డిప్యూటీ ఈఈ ఇరిగేషన్), శ్రీనివాస్‌రావు (ఏఈఈ, ఇరిగేషన్), భాస్కర్‌రావు (ఏఈఈ ఇరిగేషన్), నరసింహమూర్తి (ఏఈఈ, ఇరిగేషన్) ఉన్నారు.

13 మందికి హెచ్చరిక మెమోలు..

జిల్లా కలెక్టర్ వెంకటరావు శుక్రవారం జిల్లా అధికారులతో వెబెక్స్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు 13 మంది జిల్లా అధికారులు గైర్హాజరయ్యారు. వీరికి కలెక్టర్ హెచ్చరిక మెమోలు జారీ చేశారు.

పోస్టల్ బ్యాలెట్ ఓటుకు సెలవు

లోక్‌సభ ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్‌లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేయడానికి స్పెషల్ క్యాజువల్ లీవ్ మంజూరు చేసిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటరావు ఒక ప్రకటనలో తెలిపారు.

రైతులను నిలువునా మోసం చేసిన ప్రభుత్వం



వెలుగుపల్లిలో ఎండిన వరిపంటను పరిశీలిస్తున్న జగదీష్‌రెడ్డి తదితరులు

- మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి

తుంగతుర్తి: రైతులను రాష్ట్ర ప్రభుత్వం నిలువునా మోసం చేసిందని మాజీమంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తుంగతుర్తి మండలం వెలుగుపల్లి, సింగారంతండా, మొండికుంటతండాలో ఎండిపోయిన పంట పొలాలను తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్‌తో కలిసి పరిశీలించి మాట్లాడారు. కాంగ్రెస్ పాలన నిర్లక్ష్యం వల్లనే వ్యవసాయం సంక్షోభంలోకి వెళ్లిందన్నారు. ఎస్సారెస్పీ కాలువల ద్వారా నీళ్లు ఇస్తాం, పంటలు వేసుకోండని చెప్పి నీళ్లు ఇవ్వకపోవడంతో నేడు సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాల్లో ఎక్కడ చూసినా ఎండిపోయిన పంట పొలాలే దర్శనమిస్తున్నాయన్నారు. అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే కాంగ్రెస్ పాలకులు కాళేశ్వరం, ఎస్సారెస్పీ ఆయకట్టు ఎడారిలా మార్చారన్నారు. మంత్రులకు దమ్ముంటే రైతుల వద్దకు వెళ్లి ఎండిన పంట పొలాల వివరాలను తెలుసుకోవాలన్నారు. కాంగ్రెస్‌ది రైతు వ్యతిరేక ప్రభుత్వమన్నారు. గత బీఆర్‌ఎస్ పాలనలో రైతులను రారాజు చేసిన ఘనత కేసీఆర్‌దే అన్నారు. ప్రభుత్వానికి ఒక ప్రణాళిక అంటూ ఏమీ లేదని, గ్రామాల్లో మంచినీటి సమస్య కూడా ఉత్పన్నమైందన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య, కల్లెట్లపల్లి ఉప్పలయ్య, వైస్‌ఎంపీపీ మట్టపల్లి శ్రీశైలం, ఎంపీటీసీ కవిత, గుండగాని రాములు, సింహాద్రి, నాగయ్య, శంకర్, చంద్రమౌళి, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ధరణి' ఆపరేటర్లకు వేతన వెతలు

- గత ఏడాది మార్చి నుంచి అందని జీతాలు
- ఇటీవల మూడు నెలలవి అందజేత
- ఇంకా తొమ్మిది మాసాల జీతం పెండింగ్‌లోనే..
- జీఓ 63 ప్రకారం వేతనాలు పెంచాలని కోఆర్డినేటర్లు, ఆపరేటర్ల వేడుకోలు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 83 మంది సిబ్బంది



కలెక్టర్ వెంకటరావుకు వినతి పత్రం ఇస్తున్న ధరణి ఆపరేటర్లు (ఫైల్)

హుజూర్‌నగర్: ధరణి పోర్టల్‌లో కంప్యూటర్ ఆపరేటర్లుగా పనిచేస్తున్న ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని సిబ్బందికి తొమ్మిది నెలలుగా వేతనాలు అందడం లేదు. దీంతో వారి కుటుంబాలు గడవక అప్పులు చేయాల్సిన పరిస్థితి దాపురించింది. వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ల కోసం గత ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ధరణి పోర్టల్‌ను తీసుకొచ్చింది. జిల్లాలోని అన్ని మండలాల్లో రిజిస్ట్రేషన్ వ్యవహారాలను ధరణి ఆపరేటర్లకు అప్పగించింది. అన్ని తహసీల్దార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ల కోసం ప్రత్యేకంగా సిబ్బందిని నియమించారు. సూర్యాపేట జిల్లాలో ఒక కోఆర్డినేటర్, 25 మంది ఆపరేటర్లు, నల్లగొండ జిల్లాలో ఒక కోఆర్డినేటర్, 38మంది ఆపరేటర్లు, యాదాద్రి భువనగిరి జిల్లాలో ఒక కోఆర్డినేటర్, 17మందితో కలిపి ఉమ్మడి జిల్లాలో మొత్తం 83 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ధరణి ఆపరేటర్లకు 2021 జూలై 15 వరకు నెలకు రూ.9,878ల చొప్పున, 2021 జూలై తర్వాత నుంచి ఈఎస్‌ఐ, పీఎఫ్‌తోపాటు ఇతర కటింగ్ లు పోను మొత్తం రూ.11,070ల చొప్పున వేతనాలు చేతికి అందిస్తున్నారు. అయితే 2023 మార్చి నుంచి వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల ధరణి ఆపరేటర్లు తమకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని కోరుతూ ధరణి ఆపరేటర్ల సంఘం ప్రతినిధులు ప్రభుత్వానికి, కలెక్టర్లకు వినతి పత్రాలు అందజేశారు. దీంతో వారం రోజుల క్రితం మూడు నెలల వేతనం మాత్రమే ప్రభుత్వం విడుదల చేసింది. ఇంకా తొమ్మిది నెలల వేతనాలు రావాల్సి ఉంది.

కుటుంబ పోషణ భారమై..

ధరణి ఆపరేటర్లుగా నియమితులైన వారిలో ఎక్కువ మంది ఇంజినీరింగ్ పట్టభద్రులే ఉన్నారు. భవిష్యత్తులో ప్రభుత్వం వేతనాలు పెంచుతుందనే ఆశతో వీరు విధులు నిర్వహిస్తున్నారు. అయినా తొమ్మిది నెలలుగా వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషణ భారమై అప్పుల పాలవుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2021 జూన్‌లో వచ్చిన జీఓ 63 ప్రకారం తమ వేతనం రూ 31,040లకు పెంచడంతో పాటు ప్రతినెలా 5వ తేదీలోగా వేతనాలు చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



ధరణి ఆపరేటర్లలో ఎక్కువ మంది పేదవాళ్లమే ఉన్నాం. తొమ్మిది నెలల వేతనాలు రాకపోవడంతో వారంతా చాలా ఇబ్బందులు పడుతున్నాం. కుటుంబ పోషణ కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం స్పందించి ఏజెన్సీల ద్వారా కాకుండా నేరుగా ట్రెజరీల ద్వారా వేతనాలు చెల్లించాలి. జీఓ 63 ప్రకారం మాకు వేతనాలు అందించాలి. అంతే కాకుండా మహిళా ఆపరేటర్లకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు కూడా ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం.

– ఎస్‌కే సలీం, జిల్లా అధ్యక్షుడు, ధరణి ఆపరేటర్ల సంఘం, సూర్యాపేట

ఉద్యోగ భద్రత కల్పించాలి



ధరణి పోర్టల్ పనిచేస్తున్న సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించి జీఓ నంబర్ 63 ప్రకారం కనీస వేతనంగా నెలకు రూ.31,040 అందజేయాలి. మహిళలకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు మంజూరు చేయాలి. సిబ్బంది అందరికీ బీమా సౌకర్యం కల్పించి ఆదుకోవాలి. విధినిర్వహణలో ఉండగా చనిపోయిన వారి కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి.

– పగిడి నాగరాజు, ధరణి ఆపరేటర్, తిరుమలగిరి సాగర్ మండలం, నల్లగొండ

ఏప్రిల్ 6న మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ ఎన్నిక

తిరుమలగిరి(తుంగతుర్తి): తిరుమలగిరి మున్సిపల్ నూతన చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ ఎన్నిక ఏప్రిల్ 6వ తేదీన నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి శుక్రవారం ఓప్రకటనలో తెలిపారు. చేతులెత్తే పద్ధతిలో ఎన్నిక నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈనెల 20న చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌పై కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టడంతో పదవులు కోల్పోయిన విషయం తెలిసిందే.

పదవులు వరించేదెవరినో..?

నూతనంగా ఏర్పడిన తిరుమలగిరి మున్సిపల్ చైర్‌పర్సన్ పదవి ఎస్సీ మహిళకు రిజర్వేషన్ అయింది. మున్సిపాలిటీలోని 5, 8, 13వ వార్డుల నుంచి ఎస్సీ మహిళా అభ్యర్థులు గెలుపొందారు. దీంతో 5వ వార్డు అభ్యర్థి పోతరాజు రజనిరాజశేఖర్ చైర్‌పర్సన్‌గా ఎంపికయ్యారు. ఆమెపై అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టడంతో పదవి కోల్పోయారు. ప్రస్తుతం 8వ వార్డు నుంచి శాగంటి అనసూయరాములు, 13వ వార్డు నుంచి పత్తెపురం సరితనాగార్జున చైర్‌పర్సన్ రేసులో ఉన్నారు. వీరిలో అనసూయరాములుకు అవకాశం ఉన్నట్లు ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. వైస్ చైర్మన్ పదవి రేసులో 1వ వార్డు అభ్యర్థి భాస్కర్, 11వ వార్డు అభ్యర్థి వై.నరేష్, 4వ వార్డు అభ్యర్థి బత్తుల శ్రీనివాస్‌లు ఉన్నారు.

క్లుప్తంగా

ఇద్దరి అరెస్ట్.. రిమాండ్

తిరుమలగిరి : దౌర్జన్యంగా భూమి రిజిస్ట్రేషన్ చేయించుకున్న ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తిరుమలగిరి ఎస్ఐ సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుమలగిరి మున్సిపాలిటీకి చెందిన వీరవెల్లి కృష్ణాంజలికి చెందిన 20గుంటల భూమిని ఇదే గ్రామానికి చెందిన ఇమ్మడి సోమనర్సయ్య తన అనుచరులతో బెదిరించి భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ కేసుతో సంబంధం ఉన్న తాడోజు శ్రీకాంతాచారి, పత్తెపురం విజయ్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి మండలంలోని చిన్నఅడిశర్లపల్లి గ్రామానికి చెందిన కంచర్ల ప్రభాకర్‌రెడ్డి కుమారుడు మధుకర్‌రెడ్డి (35) అదృశ్యమయ్యాడు. ఎస్ఐ రామ్మూర్తి తెలిపిన ప్రకారం.. కంచర్ల మధుకర్‌రెడ్డి ఈనెల 13న ఉదయం 5 గంటల సమయంలో ఎవరికి చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. కుమారుడి కోసం గాలింపు చేపట్టినప్పటికి ఆచూకీ లభ్యం కాలేదు. ఈ మేరకు తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

రూ.2.50 లక్షల నగదు సీజ్

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట) : పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మండల పరిధిలోని ఆత్మకూర్ – నెమ్మికల్ రహదారిలో శుక్రవారం ఎస్సై సైదులుగౌడ్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా మరిపెడ బంగ్లాకు చెందిన బోయిని మల్లేష్ రూ.2.50 లక్షలను తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నారు. ఈ నగదును డిస్ట్రిక్ గ్రీవెన్స్ కమిటీకి అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

రూ.2,55,750 నగదు సీజ్

మిర్యాలగూడ అర్బన్: ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న నగదును టూ టౌన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ నాగార్జున తెలిపిన వివరాల ప్రకారం.. పార్లమెంట్ ఎన్నికల కోడ్ నిబంధనలో భాగంగా ఎస్ఐ కృష్ణయ్య ఆధ్వర్యంలో పట్టణంలోని హనుమాన్‌పేట ఫ్లై ఓవర్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో వచ్చిన కారును తనిఖీలు చేయగా రూ.2 లక్షల 55 వేల 750 నగదును గుర్తించారు. దానికి సంబంధించిన ఆధారాలు చూపకపోవడంతో నగదును సీజ్ చేసి జిల్లా ట్రెజరీకి పంపించామని తెలిపారు. ఎన్నికల కోడ్ దృష్ట్యా ఆధారాలు లేకుండా నగదును తరలించవద్దని సూచించారు.

రిటైర్డ్ తహసీల్దార్ మృతి



నరేందర్‌రాయుడు (ఫైల్)

మోత్కూరు : మోత్కూరు మున్సిపల్ కేంద్రానికి చెందిన రిటైర్డ్ తహసీల్దార్ దేవినేని నరేందర్ రాయుడు (73) గురువారం హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఆయనకు భార్య దేవినేని నిర్మల బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా పని చేశారు. ఇద్దరు కొడుకులు ఉన్నారు. కొడుకులు ఇద్దరు కోడలితో పాటు అమెరికాలో ఉంటున్నారు. ఆయన అంత్యక్రియలు శనివారం మధ్యాహ్నం స్వగ్రామం మోత్కూరులో జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

అడుగంటిన ‘మూసీ’

- 620 అడుగులకు పడిపోయిన నీటిమట్టం
- డెడ్ స్టోరేజీకి చేరువలో రిజర్వాయర్



మూసీ రిజర్వాయర్‌లో తేలిన పూడిక దిబ్బలు

కేతేపల్లి: ఉమ్మడి జిల్లాలో నాగార్జునసాగర్ తర్వాత అతిపెద్ద సాగు, తాగునీటి వనరుగా ఉన్న మూసీ రిజర్వాయర్‌లో నీరు అడుగంటింది. దాదాపు ఆరు నెలల నుంచి వర్షాలు లేకపోవటం, వేసవిలో ఎండలు తీవ్రం కావటంతో పాటు ఆయకట్టులో రెండు సీజన్‌లలో పంటల సాగుకు నీటిని విడుదల చేయటంతో మూసీ రిజర్వాయర్‌లో రోజు రోజుకు నీటి మట్టం తగ్గుతుంది. 645 అడుగుల గరిష్ట నీటి మట్టం గల మూసీ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 620 అడుగులకు పడిపోయింది. మూసీ ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల పరిధిలో నకిరేకల్, సూర్యాపేట, మిర్యాలగూడ నియోజకవరాల్లోని 42 గ్రామాల్లో 35 వేల ఎకరాల భూములకు సాగునీరు అందుతుంది. గత ఏడాది జూన్ మాసంలోనే మూసీ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండటంతో వానాకాలం, యాసంగి సీజన్‌లో రెండు పంటలకు నీటిని విడుదల చేశారు. ఆయకట్టులో యాసంగి వరి పంటలు కోతకు రావటంతో ఇటీవలే కాల్వలకు నీటి విడుదల నిలిపివేశారు. ప్రస్తుతం ఆవిరి, స్పీకేజీ, లీకేజీ రూపంలో ప్రతిరోజు 35 క్యూసెక్కుల నీరు వృథా అవుతుంది. 4.46టీఎంసీల నీటినిల్వ సామర్థ్యం గల మూసీ రిజర్వాయర్‌లో ప్రస్తుతం అర టీఎంసీ నీరు మాత్రమే నిల్వ ఉంది. ప్రాజెక్టులో నీటిమట్టం 620 అడుగులు మాత్రమే ఉంది. మరో 10 అడుగుల నీరు తగ్గితే నీటిమట్టం డెడ్ స్టోరేజీకి(610అడుగులకు) చేరుకుంటుంది. 615 అడుగులకు నీటి మట్టం చేరితే దుర్వాసన, ఒండుతో కూడిన నీరు మాత్రమే రిజర్వాయర్‌లో ఉంటుంది. కనీసం పశువులు తాగేందుకు కూడా వీలుండదు. మరో రెండు నెలలు గడిస్తే గాని వర్షాలు కురిసి రిజర్వాయర్‌లోకి నీరు వచ్చే అవకాశం లేదు. అప్పటి వరకు ప్రాజెక్టులో నీరు పూర్తిగా అడుగంటే ప్రమాదముంది.



వెలవెలబోతున్న మూసీ రిజర్వాయర్

ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్ అధికారుల దాడులు



పట్టుబడిన నిందితులతో అధికారులు

హుజూర్‌నగర్ : ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం నియోజకవర్గంలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 40 లీటర్ల సారా, 40 కిలోల బెల్లం స్వాధీనం చేసుకుని ఐదుగురిని అరెస్ చేయగా ఒకరు పారి పోయారు. 750 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. హుజూర్‌నగర్‌లోని ఎక్సైజ్ కార్యాలయంలో ఎక్సైజ్ సీఐ నాగార్జునరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా ఎక్సైజ్ అధికారి లక్ష్మ నాయక్ ఆధ్వర్యంలో రాష్ట్ర, జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మట్టంపల్లి, పాలకీడు మండలాల్లో సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో బిల్యా నాయక్ తండాకు చెందిన ధరావత్ సేవ్య, ధరావత్ పీకి, బానోతు సక్రీ, బాణోత్ బికారిల వద్ద ఉన్న 40 లీటర్ల సారా, 40కిలోల బెల్లం, గ్యాస్ సిలిండర్, స్టవ్‌ను స్వాధీనం చేసుకున్నారు. సేవ్య, పీకి, సక్రీలను అరెస్ట్ చేయగా బికారి పారి పోయాడు. మంచ్యా తండాకు చెందిన భూక్య సైదాను, కొత్త తండాకు చెందిన బాణోత్ మార్వాడీలు సారా కలిగి ఉన్నందున వారిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. బిల్యా నాయక్ తండా, పాత దోనబండ తండా, కొత్త తండా, లాలితండా, మంచ్యా తండా, మీగడంపాడు తండాలతోపాటు పాలకీడు పోలీస్ ఎస్ఐ లక్ష్మీనారాయణతో కలిసి బెట్టేతండాలో విస్తతంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సుమారు 750 లీటర్ల బెల్లం పానకంను ధ్వంసం చేసి కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సీఐలు చంద్రశేఖర్, రాకేష్, మల్లయ్య, శంకర్‌లతో పాటు ఎక్సైజ్ ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు

పోలీసులు ఫిర్యాదు తీసుకోవడం లేదు



సమావేశంలో మాట్లాడుతున్న జ్యోతి

మిర్యాలగూడ: హోలీ పండుగ రోజు తనపై దాడి చేసి గాయపరిచితే రూరల్ పోలసులు చర్యలు తీసుకోకపోగా కనీసం ఫిర్యాదు కూడా తీసుకోవడం లేదని బాధితురాలు ధనావత్ జ్యోతి ఆరోపించారు. శుక్రవారం బాధిత మహిళ జ్యోతి విలేకరులతో మాట్లాడారు. మిర్యాలగూడ మండలం కొత్తసామ్యతండా గ్రామానికి చెందిన ధనావత్ జ్యోతి ఈనెల 25న ఆమె ఇంటి వద్ద ఉండగా అదే గ్రామానికి చెందిన ధనావత్ చందు, ధనావత్ సైదా, ధనావత్ కుమార్, ధనావత్ వనిత ఆమె భర్త చందులు అకారణంగా గొడవపడి దాడికి పాల్పడ్డారని తెలిపింది. ఎందుకు దాడి చేస్తున్నారని ప్రశ్నించగా చందు వేరేవారిని కారులో పిలిపించి తనను, తన భర్తను, తన బావలైన ధనావత్ కుర్వా, ధనావత్ సురేష్, తన మరిది ధనావత్ నరేష్‌లను దూషించి దాడికి పాల్పడినట్లు తెలిపారు. అంతలోనే గ్రామ పెద్దలు రాగా దుండగులు కారును వదిలేసి వెళ్లిపోయారన్నారు. కారులో వచ్చిన వారి గురించి ఆరా తీయగా ధనావత్ పవన్, అడావత్ రాము, అడావత్ ప్రసాద్, అడవత్ మాస్టర్‌లు అని తెలిసిందని అన్నారు. తమపై అకారణంగా దాడికి పాల్పడిన వ్యక్తులను పట్టుకుని శిక్షించి న్యాయం చేయాలని కోరింది. నిందితుల నుంచి తనకు ప్రాణహాని ఉందని తక్షణమే పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ధనావత్ సైదా, మంగా, గ్రామ మాజీ సర్పంచ్ సురేష్ తదితరులు ఉన్నారు.

అత్తింటి వేధింపులకు వివాహిత బలి



చందన (ఫైల్)



మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ రవి

పెన్‌పహాడ్ : అత్తింటి వేధింపులకు వివాహిత బలైంది. ఈ విషాదకర ఘటన పెన్‌పహాడ్ మండల పరిధిలోని నాగులపాటి అన్నారం గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ పెరిక రవీందర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నాగులపాటి అన్నారం గ్రామానికి చెందిన పిండిప్రోలు అయోధ్య-సునీత దంపతుల కుమార్తె చందన(23)ను మిర్యాలగూడకు చెందిన ఆనందం వేణుకు ఇచ్చి 2021లో వివాహం చేశారు. వేణు ఖమ్మం జిల్లాలోని కొత్తగూడెంలో రైల్వే శాఖలో ఉద్యోగం చేస్తున్నాడు. వీరికి 18 నెలల బాలుడు ఉన్నాడు. కొన్ని నెలల నుంచి చందనను భర్త, అత్త విజయలక్ష్మి అదనపు కట్నం తేవాలని వేధింపులకు గురిచేస్తున్నారు. దీంతో ఆమె తల్లిదండ్రుల వద్దకు వచ్చి ఉంటుంది. చందనను అదనపు కట్నం తేవాలని ఫోన్‌లో వేధిస్తూ భర్తపై పెట్టిన కేసు రాజీ పడాలని బెదిరిస్తూ ఉండగా తట్టుకోలేక తెల్లవారుజామున ఇంట్లో పైకప్పులో ఉన్న రాడ్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి అయోధ్య ఫిర్యాదు మేరకు డీఎస్పీ రవి సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. సంఘటన స్థలాన్ని రూరల్ సీఐ సురేందర్‌రెడ్డి, ఎస్ఐ రవీందర్‌లు పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బ్యాంకు డబ్బులను దుర్వినియోగం చేసిన ఉద్యోగి అరెస్ట్



మాట్లాడుతున్న సీఐ బీషన్న

నాగార్జునసాగర్: బ్యాంకు డబ్బులను దుర్వినియోగం చేసిన ఉద్యోగిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు నాగార్జునసాగర్ సీఐ బీషన్న తెలిపారు. శుక్రవారం నాగార్జునసాగర్ హిల్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో నిందితుడిని మీడియా ఎదుట ప్రవేశపెట్టి వివరాలు వెల్లడించారు. తిరుమలగిరి సాగర్ మండలం జానారెడ్డి కాలనీకి చెందిన కెతావత్ గిరీష్ నాగార్జునసాగర్ హిల్‌కాలనీలోని ఏపీజీవీబీ బ్యాంకులో ఫీల్డ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నాడు. ఖాతాదారులు బ్యాంకులో జమచేసిన రూ.6,57,000లను గిరీష్ సొంతానికి వాడుకుని డబ్బులను దుర్వినియోగం చేసి బ్యాంకును మోసగించాడని తెలిపారు. ఏపీజీవీబీ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సాగర్ ఎస్ఐ సంపత్ ఆధ్వర్యంలో విచారణ చేపట్టినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న క్రమంలో శుక్రవారం వేకువజామున ఎస్ఐ సంపత్, తన సిబ్బందితో కలిసి జానారెడ్డి కాలనీలో ఉన్న బ్యాంకు ఉద్యోగి గిరీష్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించినట్లు పేర్కొన్నారు. క్రికెట్ బెట్టింగ్‌లకు అలవాటు పడి బ్యాంకు అమాయకుల డబ్బులను వారి ఖాతాలో జమచేయకుండా క్రికెట్ బెట్టింగ్‌లలో పెట్టాడని తెలిపారు. బ్యాంకు డబ్బులు రూ.6,57,000లతో పాటు తన ఆస్తులు విక్రయించి బయట అప్పులు చేసి మరో రూ.40 లక్షల వరకు బెట్టింగ్‌లలో పెట్టి పోగొట్టుకున్నట్లు అంగీకరించినట్లు పేర్కొన్నారు. విచారణ అనంతరం సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని నిందితున్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. కేసును చేధించిన ఎస్ఐ ఎస్ సంపత్, హెడ్ కానిస్టేబుల్ గురునాథం, కానిస్టేబుల్‌లు జావిద్, హోంగార్డు రామ్మోహన్, నర్సింహ, విజయ్‌లను మిర్యాలగూడ డీఎస్పీ అభినందించనట్లు తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య



యాదిరెడ్డి (ఫైల్)

గుండాల : కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన గుండాల మండలంలోని నూనెగూడెం గ్రామంలో శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చిరుపల్లి యాదిరెడ్డి (41) కొంత కాలంగా మద్యానికి బానిసై నిత్యం భార్యతో గొడవపడే వాడు. వేగలేని భార్య మాధవి 15 రోజుల క్రితం తన తల్లిగారైన పల్లెర్ల గ్రామానికి వెళ్లింది. దీంతో యాదిరెడ్డి ఈ నెల 24న వ్యవసాయ బావి వద్దకు వెళ్లి పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన పక్క రైతులు కుటుంబ సభ్యులకు, గ్రామస్తులకు సమాచారం తెలిపి వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. ఐదు రోజులుగా చికిత్స పొందుతూ శుక్రవారం మరణించినట్లు తెలిపారు. భార్య మాధవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ యాకన్న తెలిపారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నట్లు చెప్పారు.

దాడి చేస్తున్నారంటూ హల్‌చల్

భువనగిరి క్రైం : కొందరు వ్యక్తులు తనను వెంబడిస్తూ దాడి చేయడానికి ప్రయత్నిస్తున్నారని శుక్రవారం ఓ వ్యక్తి భువనగిరి బస్టాండ్‌లో హల్‌చల్ సృష్టించాడు. గుంటూరుకు చెందిన వెంకట్ హైదరాబాద్‌లోని ఎల్‌బీనగర్‌లో తమ బంధువుల ఇంటికి వచ్చి భువనగిరి టోల్ గేట్ వద్ద బస్సు దిగాడు. భువనగిరి బస్సు ఎక్కి బస్టాండ్‌కు చేరుకున్నాడు. కాగా స్వ గ్రామమైన గుంటూరులో జరిగిన గొడవల కారణంగా అతన్ని వెంబడించగా అదే కోణంలో ఆలోచిస్తూ తనపై దాడి జరిపేందుకు వస్తున్నారని 100కు ఫోన్ చేశాడు. పోలీసులు అప్రమత్తమై బస్టాండ్‌లో అతని వద్దకు వచ్చి విచారణ చేపట్టారు. గతంలో జరిగిన గొడవల కారణంగా అతను మానసికంగా ఇబ్బంది పడుతున్నట్లు గుర్తించారు. విషయం తెలుసుకుని అక్కడికి వచ్చిన తల్లికి అతడిని అప్పగించారు.

ఖాతాలో నుంచి రూ.6,99,900 మాయం

- నగదు కాజేసిన సైబర్ నేరగాళ్లు
- సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు



బాధితుడు బాలయ్య

కొండమల్లేపల్లి : దేవరకొండ మండలం ముదిగొండ గ్రామానికి చెందిన మారుపాకల బాలయ్యకు ముదిగొండ పంజాబ్ నేషనల్ బ్యాంకులో గల ఖాతా నుంచి సైబర్ నేరగాళ్లు 6,99,900 రూపాయలను కాజేశారు. శుక్రవారం వెలుగుచూసిన ఈ ఘటనకు సంబంధించి బాధితుడు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. గురువారం ఉదయం 11 గంటలకు ఓ వ్యక్తి ఫోన్ చేసి పంజాబ్ నేషనల్ బ్యాంక్ నుంచి మాట్లాడుతున్నామని అంటూ మారుపాకుల బాలయ్య మీరేనా అని అడగడంతో అవునని సమాధానం ఇచ్చి ఫోన్ కట్ చేశాడు. అనంతరం పదే పదే మూడుసార్లు ఫోన్ చేయడంతో కట్ చేసినట్లు బాధితుడు పేర్కొన్నాడు. అనంతరం తన ఫోన్‌కి రెండు మెసేజ్‌లు వచ్చాయని, మొదటి మెసేజ్‌లో రూ.4,99,900 రూపాయలు డెబిట్ అయినట్లు, రెండో మెసేజ్‌లో రూ.2లక్షలు డెబిట్ అయినట్లు రావడంతో ముదిగొండ పంజాబ్ నేషనల్ బ్యాంక్ మేనేజర్‌కు ఫోన్లో సంప్రదించగా ఆన్‌లైన్ మోసం జరిగినట్లు మేనేజర్ తెలిపినట్లు తెలిపాడు. ఈ విషయమై ముదిగొండ పంజాబ్ నేషనల్ బ్యాంక్ మేనేజర్ శ్రీధర్‌ను ఫోన్లో సంప్రదించగా సదరు ఖాతాదారుడు ఏపీకే యాప్ ద్వారా నైనా గాని లేదా ఓటీపీలు చెప్పడం ద్వారానైనా గాని ఈ సైబర్ నేరగాళ్లు మోసానికి పాల్పడినట్లు పేర్కొన్నారు. బాలయ్య ఖాతాకు చెందిన నగదు కెనరా బ్యాంక్‌కు ఖాతాకు క్రెడిట్ అయినట్లు, ఆన్‌లైన్‌లో కెనెరా బ్యాంక్ ఏ బ్రాంచ్ అనే సమాచారం లేదని మేనేజర్ వివరణ ఇచ్చారు. బాధితుడు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు

నూతనకల్ : వ్యక్తి అదృశ్యమైన సంఘటనపై శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ జె సైదులు తెలిపిన వివరాల ప్రకారం....మండల పరిధిలోని తాళ్లసింగారం గ్రామానికి చెందిన పెసరి నాగయ్య ఈ నెల 5న ఇంట్లో ఎవరూ లేని సమయంలో బయటకు వెళ్లి నేటి వరకు తిరిగి రాలేదు. ఇతను వ్యక్తి ఆచూకీ కోసం బంధువులను, చుట్టుపక్కల వారిని అడిగి తెలుసుకోగా ఏలాంటి సమాచారం లేకపోవడంతో నాగయ్య తల్లి వెంకటమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.ఇతడికి మతిస్థితిమితం లేదని తెలిపారు.

మఠంపల్లిలో గుడ్ ఫ్రైడే



మఠంపల్లిలో శిలువ మోస్తున్న ఏసుక్రీస్తు

మఠంపల్లి: మఠంపల్లిలో క్రైస్తవులకు ఆధ్యాత్మిక కేంద్రంగా వెలుగొందుతున్న శుభవార్త చర్చి ఆధ్వర్యంలో శుక్రవారం గుడ్‌ఫ్రైడే వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా స్థానిక చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేసిన క్రైస్తవులంతా ప్రధాన రహదారికి చేరుకున్నారు. పిలాత్‌రాజు ఏసుక్రీస్తుకు శిలువదండన విధించి పావన జలపానంలో చేతులుకడుగుకునే సన్నివేశంతో గుడ్‌ఫ్రైడే వేడుకలను ప్రారంభించారు. ఈసందర్భంగా 14చోట్ల భటులు కొరడాలతో కొట్టుచుండగా రక్తపుధారలు కారుచున్నా ఏసుక్రీస్తు శిలువను మోసే సన్నివేశాలతో కళాకారులు రక్తికట్టించారు. భారీగా వచ్చిన క్రైస్తవులు, మహిళలు విషన్నవదనాలతో ర్యాలీగా క్రీస్తు వెంట నడిచారు.చివరిగా చర్చి ఆవరణలో ఏసుక్రీస్తు శిలువవేసే సన్నివేశం క్రైస్తవుల కంట కన్నీరు తెప్పించింది.అనంతరం చర్చిలో ఫాదర్ మార్టిన్ మాట్లాడుతూ లోకంలోని జనులను పాపాలనుండి రక్షించేందుకే క్రీస్తుశిలువ మోసాడన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆదూరిస్రవంతి కిషోర్‌రెడ్డి,లూర్దుమారెడ్డి, జయభారత్‌రెడ్డి, గాలిచిన్నపురెడ్డి, ఆంతోనిరెడ్డి, బాలశౌరెడ్డి, బాలరెడ్డి,జార్జిరెడ్డి, ఇన్నారెడ్డి,శౌరెడ్డి,అదిక సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు. అదే విధంగా మండలంలోని చౌటపల్లి, రఘునాదపాలెం, అల్లీపురం.పెదవీడు తదితర గ్రామాలలో గల చర్చిలలో శుక్రవారం గుడ్‌ఫ్రాడే వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈసందర్భంగాఆయా గ్రామాలలోని చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

చెస్ క్రీడాకారిణికి ఎస్పీ అభినందనలు



విద్యార్థినిని అభినందిస్తున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేటటౌన్ : ప్రతిష్టాత్మమైన కమిషన్ ఫర్ ఉమెన్ చెస్, వరల్డ్ చెస్ ఫెడరేషన్ ఫిడే సంయుక్తంగా నిర్వహించిన క్వీన్స్ ఆన్లైన్ ఫెస్టివల్ 2024లో రాడికల్ చెస్ అకాడమీకి చెందిన కప్పల ఇందిర అండర్ 16 విభాగంలో ఏడు రౌండ్లలో ఆరు రౌండ్లు గెలిచి ఫైనల్‌కు ఎంపికైంది. లీగ్ దశలో 193 దేశాలు క్రీడాకారులు ఈ పోటీలో పాల్గొన్నట్టు కోచ్ ఎడవెల్లి అనిల్‌కుమార్ తెలిపారు. ఆసియా, యూరప్, అమెరికా ఆఫ్రికా ఖండాల నుంచి 400 పైగా క్రీడాకారులు పాల్గొన్నట్టు చెప్పారు. లీగ్ దశలో ఏడుకు ఆరు పాయింట్లు గెలిచి ఫైనల్‌కు అర్హత సాధించిందన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఇందిరను జిల్లా ఎస్పీ రాహుల్‌హెగ్డే శుక్రవారం అభినందించారు.

గిరిజన హక్కులను పరిరక్షిస్తాం

- జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్

భువనగిరి : తెలంగాణలో గిరిజన హక్కులను పరిరక్షిస్తామని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాట్రోత్ హుస్సేన్ నాయక్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి వరంగల్‌కు వెళ్తున్న ఆయనకు స్థానిక బైపాస్‌రోడ్డు మార్గంలోని న్యూ వివేరా హోటల్ వద్ద రాష్ట్ర గిరిజన మోర్చా నాయకులు అజ్మీర్ కిషన్ నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా స్వాతగం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎస్టీ కమిషన్ దృష్టికి తీసుకవస్తే వాటి పరిష్కారం కృషి చేస్తామన్నారు. అంతకు ముందు ఆయనకు శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో గిరిజన మోర్చా రాష్ట్ర కార్యదర్శి భూక్య శ్రీనునాయక్, మున్సిపల్ వైస్ చైర్మన్ మాయ దశరథ, పార్టీ పట్టణ కమిటి అధ్యక్షుడు రత్నపురం బలరాం,జిల్లా ప్రధాన కార్యదర్శి చందా మహేందర్ గుప్తా, పట్టణ ప్రదాన కార్యదర్శి శ్రీశైలం, భూక్య నరేష్ నాయక్, మాలోత్ రమేష్ నాయక్, కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్మోహన్‌రెడ్డి, నర్సింహ్మచారి,సత్యం సాయికుమార్, అశోక్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా

- నల్లగొండ ఎస్పీ చందనా దీప్తి

నల్లగొండ క్రైం: జిల్లాలో రౌడీ షీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు నల్లగొండ ఎస్పీ చందనా దీప్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో శాంతి భద్రతలకు ప్రజల స్వేచ్ఛకు ఆటంకం కలిగిస్తే కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. పాత రౌడీ షీటర్లు, నేరస్తులు, సెటిల్‌మెంట్లు, దందాలకు పాల్పడే వారి పట్ల ప్రత్యేక నిఘా ఉంచి వారి కదలికలపై అప్రమత్తంగా వ్యవహరించాలని పోలీసు యంత్రాంగాన్ని ఆదేశించారు. జిల్లాలో ఇప్పటి వరకు 155 కేసుల్లో సంబంధం ఉన్న 265 మందిని సంబంధిత ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ వద్ద బైండోవర్ చేసినట్లు చెప్పారు. ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో సమస్యాత్మకంగా ఉండే ప్రాంతాలు, వ్యక్తులు సమస్యలు సృష్టించే వారిపై నిఘా ఉంటుందన్నారు. పదే పదే నేరాలకు పాల్పడితే పీడీ యాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు. గంజాయి అక్రమ రవాణా, క్రికెట్ బెట్టింగ్‌లు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. చెక్ పోస్టులలో విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. అధిక మొత్తం డబ్బులు తీసుకెళితే సరైన ఆధారాలు చూపాలన్నారు.

క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని నల్లగొండ ఎస్పీ చందనా దీప్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత ఐపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ నడుస్తున్నందున యువత ఈజీ మనీ సంపాదనకు క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారని తెలిపారు. అలాంటి వారి పట్ల నిఘా ఉంచి చర్యలు తీసుకుంటామని తెలిపారు. బెట్టింగ్‌ల వల్ల ఆర్థికంగా నష్టపోయి యువత ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలిపారు. ఫలితంగా వారి కుటుంబాలు దుర్భర జీవితంలోకి వెళుతున్నాయని తెలిపారు. వినోదం కోసం ఆడే ఆటను ఆహ్లాదకరంగానే చూడాలని ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని సూచించారు. బెట్టింగ్‌ల సమాచారం పోలీసులకు అందించాలని కోరారు.

బెల్టు షాపులపై పోలీసుల దాడి

శాలిగౌరారం: పార్లమెంట్ ఎన్నికల నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ నేతృత్వంలో శుక్రవారం రాత్రి మండలంలోని గురుజాల గ్రామంలో అక్రమంగా నడుపుతున్న మద్యం బెల్టు దుకాణాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. గ్రామంలో మద్యం బెల్టు దుకాణం నడుపుతున్న షేక్ పాషా ఇంట్లో సోదాలు చేయగా 20 బీర్లు లభ్యమయ్యాయని తెలిపారు. పట్టుబడిన మద్యం విలువ రూ.3250లు ఉంటుందని ఎస్ఐ తెలిపారు. పట్టుబడిన బీర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించి సీజ్ చేసి అక్రమంగా బెల్టుషాపు నడుపుతున్న షేక్ పాషాపై ఎక్సైజ్ యాక్ట్ 34(ఏ) సెక్షన్ కింద కేసున మోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

భక్తురాలికి బ్యాగ్ అప్పగింత



భక్తురాలికి బ్యాగ్ అందజేస్తున్న హోంగార్డు

యాదగిరిగుట్ట: యాదాద్రీశుడి ఆలయానికి అనుబంధంగా కొనసాగుతున్న శ్రీపూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి వారి దేవాలయంలో ఓ భక్తురాలు పోగొట్టుకున్న బ్యాగ్‌ను తిరిగి సిబ్బంది, హోంగార్డు అప్పగించిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఆలయ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం .. సిద్దిపేటకు జిల్లాకు చెందిన ఓ భక్తురాలు తన కుటుంబ సభ్యులతో కలిసి పాతగుట్ట ఆలయానికి వచ్చింది. మధ్యాహ్నం 12గంటల సమయంలో శ్రీస్వామిని దర్శించుకొని, అనంతరం అక్కడే తాను తెచ్చుకున్న బ్యాగ్‌ను వదిలేసి వెళ్లిపోయింది. దీనిని గమనించిన ఆలయ ప్రచారశాఖలో విధులు నిర్వహిస్తున్న ఆంజనేయులు మైక్ అనౌన్స్‌మెంట్ చేశారు. దీంతో భక్తురాలు ఆలయంలోకి వచ్చిన తరువాత వివరాలు తెలుసుకొని బ్యాగ్‌ను ఆలయ ఇన్‌స్పెక్టర్ మెరుగు నర్సింహ, హోంగార్డు సిబ్బంది శ్రీశైలం, బి.నర్సింహరావు అందజేశారు.

వడ్డెరుల అభివృద్ధికి పాటు పడాలి

- వడ్డెర సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సైదులు



వినతిపత్రం అందిస్తున్న సంఘం నాయకులు

భానుపురి (సూర్యాపేట) : సమాజంలో ఆర్థికంగా రాజకీయంగా అన్ని రంగాల్లో వెనుకబడిన వడ్డెర కులానికి అధిక నిధులు కేటాయించి వారి అభివృద్ధికి పాటుపడాలని తెలంగాణ వడ్డెర సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు దండగుల సైదులు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం వడ్డెరలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డిలకు వినతి పత్రం అందజేసి మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్ల కాలంలో వడ్డెరల అభివృద్ధికి ఎలాంటి నిధులు కేటాయించలేదన్నారు. కాంగ్రెస్ ఎన్నికల ప్రచారంలో రాహుల్ గాంధీ వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేరుస్తామని ప్రకటించారని తెలిపారు. ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకుని రానున్న అసెంబ్లీ సమావేశాల్లో వడ్డెర కులాన్ని ఎస్టీలో చేరుస్తూ తీర్మానం చేసి కేంద్రానికి పంపించాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ వడ్డెర సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సుర వెంకన్న, ఇరగదిండ్ల అంజయ్య, కొడదల రాంబాబు, తమ్మిశెట్టి రాజేష్, గోగుల లింగయ్య, శివరాత్రి మహేష్, అశోక్, గోగుల సైదులు, అశోక్, సురి పాల్గొన్నారు.